క్లుప్తంగా

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం



మాట్లాడుతున్న జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి

లేపాక్షి: మండలంలోని వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జెండాను జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి ఆవిష్కరించారు. బాబావలి మాట్లాడుతూ.. విద్యా ప్రైవేటీకరణకు, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో పోరాటాలు చేస్తామన్నారు. నాయకులు మంజునాథ్, నరసింహమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లిలో బీసీ వసతి గృహంలో ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి నాయకులు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకుడు భగత్ , అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలపై ఆంక్షలు



మాట్లాడుతున్న హిందూపురం డీఎస్పీ మహేష్

హిందూపురం: నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఆరోగ్యకరమైన వాతావరణంలో జరుపుకోవాలని హిందూపురం డీఎస్పీ మహేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో 30 పోలీసు యాక్ట్ అమలులో ఉందన్నారు. పోలీసు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. 31వ తేదీ రాత్రి 10 గంటల తర్వాత బహిరంగ ప్రదేశాల్లోనూ రోడ్లపై ఎలాంటి వేడుకలకు అనుమతి లేదన్నారు. రాతంత్రా పోలీసులు వాహనాల్లో తనిఖీలు నిర్వహిస్తారని చెప్పారు. ముఖ్యమైన కూడళ్లలో పోలీసు పికెట్‌లు ఉంటాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే శిక్ష తప్పదన్నారు. ప్రజా జీవనానికి ఎవరు భంగం కలిగించినా కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం దుకాణాలు, రెస్టారెంట్లు నిర్ణీత సమయంలో మూసివేయాలన్నారు.

బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి



గంగులయ్యను సన్మానిస్తున్న నాయకులు

లేపాక్షి: జిల్లాలో ఉన్న బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు డాక్టరేట్ గ్రహీత చెరుకూరి గంగులయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక లేపాక్షిలోని ఆర్‌జేహెచ్ ఫంక్షన్ హాల్‌లో ఆయనను హెచ్ఆర్‌సీసీఐ, రాష్ట్రీయ హిందూ పరిషత్, మంజుల సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయన్ను సత్కరించారు. మానవ హక్కుల పరిరక్షణ సంస్థ కార్యదర్శి కిష్టప్ప, రాష్ట్రీయ హిందూ పరిషత్ అధ్యక్షుడు నాగేంద్ర, మాల మహానాడు అధ్యక్షుడు శంకర, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు సంపంగి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా క్రీడా పోటీలు



ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని సీఅండ్‌ఐజీ కాంపౌండ్ చర్చిలో క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని చర్చి డీకెన్ బోర్డు ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. పరుగు పందెం, వీల్ ఛైర్, లెమన్ అండ్ స్పూన్, పాటల పోటీలు , వాలీబాల్, బాట్మింటన్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి 1వ తేదీన చర్చిలో బహుమతులు ప్రదానం చేస్తామని నిర్వాహకులు శ్యామ్‌బాబు, ప్రభుదాస్, జానీ, సందీప్, సురేష్, చిన్నా, వరుణ్ తెలిపారు.

హనుమాన్ విగ్రహానికి రూఫ్ టాప్ ఏర్పాటు



రూఫ్‌టాప్ ఏర్పాటు చేయించిన దాతను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని దండురోడ్డులోని భారీ ఏకశిలా హనుమాన్ విగ్రహం వద్ద నూతనంగా రూఫ్ టాప్ ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 37 అడుగుల విగ్రహం ఓపెన్‌టాప్‌గా ఉండడంతో దాత తిప్పేస్వామి రూ.9 లక్షలు ఇవ్వడంతో విగ్రహానికి రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నారాయణస్వామి, కార్యదర్శి చౌడేష్, ప్రభాకర్, వెంకటేశప్ప, వెంకటేష్, నాగేంద్ర, రామకృష్ణ పాల్గొన్నారు.

సోమందేపల్లి



సోమందేపల్లి మండలం చిన్న బాబయ్యపల్లిలో రోడ్డు దుస్థితి

హిందూపురం



హిందూపురం బైపాస్‌లో ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో అధ్వానంగా ఉన్న రోడ్డు

అగళి



కంకర తేలిన అగళి మండలం మారమ్మగుడి వద్ద నుంచి గాయత్రికాలనీకి వెళ్లే రోడ్డు

- హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో అధ్వానంగా రోడ్లు
- రూ.కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నామని సీఎం చంద్రబాబు గొప్పలు
- స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ కూడా పట్టించుకోకపోవడంతో ప్రజల ఇబ్బందులు



ఇవేం రోడ్లు బాబూ?

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని రోడ్లు అధ్వానంగా మారాయి. అడుగుకో గుంత, రోడ్డుపై తేలిన కంకర, మట్టిరోడ్లపై కూడా సరిగా నడవలేని స్థితిలో తయారు కావడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.కోట్ల ఖర్చుతో మొత్తం రోడ్లను అత్యంత సుందరంగా మారుస్తున్నామంటూ సీఎం చంద్రబాబుతో పాటు కూటమి నేతలు గొప్పలు చెబుతున్నారే తప్ప పట్టించుకున్న పాపానమాత్రం పోలేదని ప్రజలు వాపోతున్నారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సినిమాలకే పరిమితమై ప్రజల సమస్యలను గాలికి వదిలేశారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెనుకొండ ఎమ్మెల్యే, మంత్రి సవిత హడావుడి తప్ప చేసిందేమీ లేదన్న విమర్శలున్నాయి. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుతో పాటు ఎంపీ బీకే పార్థసారథికి ప్రజల బాధలు పట్టడంలేదని గ్రామీణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డంతా కంకర తేలింది



మా గ్రామానికి వెళ్లే రహదారి గుంతలమయం కావడంతో అవస్థలు పడుతున్నాం. రోడ్డు నిర్మాణం కూడా అర్ధాంతరంగా ఆగిపోవడంతో రహదారి కంకర తేలింది. సమస్యను పరిష్కరించాలని అనేక సార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకొన్న ఫలితం లేకపోయింది.

– శివారెడ్డి, గంగాదేవపల్లి, గోరంట్ల మండలం

పెనుకొండ టౌన్



పెనుకొండలోని నారాయణమ్మకాలనీ వద్ద రోడ్డుపై ఉన్న గుంతల్లోకి వర్షపు నీరు చేరడంతో ..

చిలమత్తూరు



కమ్మయ్యగారిపల్లి ప్రధాన రహదారి ఇలా..

అమరాపురం



గుంతలు తేలిన అమరాపురం - విరుపసముద్రం రహదారి

రొద్దం



రొద్దం మండలం చెరుకూరు చెరువు కట్ట వద్ద గుంతలమయంగా మారిన ప్రధాన రహదారి

మా బాధలు వర్ణనాతీతం



మా ఊళ్లో 250 ఇళ్లు ఉన్నాయి. అమ్మవారిపల్లి నుంచి మా ఊరికి చేరుకోవాలంటే 5 కిలో మీటర్లు ప్రయాణించాలి. దారిపొడువునా గుంతలే ఉన్నాయి. వర్షం వచ్చిందంటే మా బాధలు వర్ణణాతీతం. ఎన్నోసార్లు రోడ్డు వేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– రామాంజినేయులు, మోటువారిపల్లి, పెనుకొండ మండలం

ఆటో వాళ్లు కూడా రారు



ఇరిగేపల్లి సమీపంలోని మండే మారమ్మ గుడి వద్ద నుంచి సుగాలితండా నుంచి గాయత్రికాలనీకి 4 కి.మీ దూరం ఉంటుంది. రోడ్డు మొత్తం ధ్వంసమై రాళ్లు తేలినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మా ప్రాంతానికి బస్సులేదు. ఆటో వాళ్లను అడిగితే మీ ఊరికి మేము రామని ఖరాకండిగా చెబుతున్నారు.

– నరసింహరాజు, గాయత్రీ కాలనీ, అగళి

పరిగి



పరిగి మండలంలో దుస్థితిలో ఉన్న ఊటుకూరు- బీచిగానిపల్లికి వెళ్లే రోడ్డు

గొప్పలు చెప్పేందుకే ...



మడకశిర మండలం తడకలపల్లి క్రాస్ నుంచి ఎల్లోటి గ్రామానికి వెళ్లే రోడ్డు దాదాపు 3 కిలో మీటర్లు గుంతలమయంగా మారింది. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం జరగడం ఖాయం. ఇప్పటికే ఎన్నో ప్రమాదాలు జరిగాయి. గుంతలు పడిన రోడ్లు బాగు చేస్తామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పింది. కానీ గుంతలు పడిన రోడ్డును బాగా చేయకపోవడంతో రోడ్లు అధ్వానంగా మారాయి.

– శ్రీరామరెడ్డి , ఎల్లోటి, మడకశిర మండలం

పట్టించుకోవడం లేదు



మండలంలోని మానేపల్లి – గౌరిగానపల్లి రోడ్డు కంకర తేలడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మా పంచాయతీ పూర్తిగా కర్ణాటక సరిహద్దులో ఉండటంతో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. బీటీ రోడ్డు వేయాలని ఎమ్మెల్యే బాలకృష్ణతో పాటు ఎంపీలకు, అధికారులకు విన్నవించినా ఎవరూ స్పందించలేదు.

– మంజునాథ్, మానేపల్లి, లేపాక్షి మండలం

మడకశిర



గతుకులమయంగా మారిన మడకశిర మండలం ఎల్లోటికి వెళ్లే రోడ్డు

గోరంట్ల



గోరంట్ల మండలం గంగాదేవపల్లికి వెళ్లే రహదారి కంకర తేలిన దృశ్యం

పెనుకొండ



పెనుకొండ మండలం చిన్నపరెడ్డిపల్లి నుంచి మోటువారిపల్లికి వెళ్లే రహదారి ఇలా..

రొళ్ల



మట్టిరోడ్డుకే పరిమితమైన రొళ్ల మండలం ఆర్.వద్రహట్టి క్రాస్ - హునిసేకుంట రోడ్డు

లేపాక్షి



కంకర తేలిన లేపాక్షి మండలం మానేపల్లి రోడ్డు

నూతన విగ్రహానికి ఘన స్వాగతం

అమరాపురం: మండలంలోని గొడనకుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ప్రాణ ప్రతిష్ఠాపన చేయడానికి వక్కలిగ కులంలోని జానకల్లు గోత్రానికి చెందిన భక్తులు ఆదివారం చిత్రదుర్గం నుంచి కెంచమాంబదేవి విగ్రహాన్ని తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో తమ్మడేపల్లి, గొడనకుంట గ్రామస్తులు విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో గొడనకుంట గ్రామానికి తీసుకెళ్లారు.

సీఐటీయూ కన్వీనింగ్ కమిటీ ఎన్నిక

హిందూపురం టౌన్: సీఐటీయూ పట్టణ కన్వీనింగ్ కమిటీని ఆదివారం సీఐటీయూ నాయకులు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. పట్టణంలోని కల్లూరు సుబ్బారావు పార్కులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెడ్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కన్వీనింగ్ కమిటీ కన్వీనర్‌గా వీఆర్ రాము, కో కన్వీనర్‌గా ఆటో రామకృష్ణను అనుబంధ సంఘాల నాయకుల సమక్షంలో ఎన్నిక చేశారు.

ఘనంగా భక్త కనకదాస జయంతి



విగ్రహావిష్కరణలో పాల్గొన్న మంత్రి సవిత

పరిగి: మండలంలోని గొల్లపల్లిలో ఆదివారం నిర్వహించిన కనకదాస జయంతి వేడుకల్లో మంత్రి సవిత పాల్గొన్నారు. అనంతరం హొన్నంపల్లిలో మాజీ మంత్రి రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం నిర్మించిన భక్త కనకదాస విగ్రహాన్ని హిందూపురం పార్లమెంట్ ఎంపీ బీకే పార్థసారథితో కలిసి ఆవిష్కరించారు. గౌరవనహళ్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహించిన స్వామి వారి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు.

'రామా..వినవేమిరా' పుస్తకావిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కవులు, పట్టణ వాసులు

పెనుకొండ: పట్టణానికి చెందిన రామబ్రహ్మం రచించిన రామా..వినవేమిరా, భక్తిసుధా పుస్తకాలను ప్రొఫెసర్ శశాంక్‌మౌళి ఆవిష్కరించారు. స్థానిక వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా అధ్యక్షత వహించి మాట్లాడారు. పెనుకొండకు చెందిన రామబ్రహ్మం పెనుకొండ వాసి అని, అయితే బెంగళూరులో స్థిరపడ్డారన్నారు. సైన్స్ మాస్టర్‌గా, శాస్త్రవేత్తగా, లెక్చరర్‌గా పని చేశారన్నారు. సమాజానికి ఉపయోగపడేలా అనేక రచనలు చేస్తుండటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు నాగరాజు, సుధాకర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

'ఫళారం'లో ప్రత్యేక ప్రార్థనలు

గుడిబండ: శాంతి మార్గాన్ని చూపడం కోసం ఏసు ప్రభువు ఈ లోకానికి వచ్చారని పాస్టర్ మంజునాథ్ తెలిపారు. 'క్రిస్మస్' వేడుకల్లో భాగంగా మండల పరిధిలోని ఫళారం గ్రామ సమీపంలో ఆదివారం మత పెద్దలు, గ్రామ ప్రజలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ వేషధారణ, నృత్యాలతో సందడి చేశారు.

వాహనాల తనిఖీ

అగళి: మండల కేంద్రంలోని మడకశిర రోడ్డు వద్ద ఆదివారం సాయంత్రం ఎస్ఐ వీరేష్ సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. గుర్తింపు పత్రాలు లేని వాహనదారులకు, హెల్మెట్ లేని వారికి, సీటు బెల్టు పెట్టుకోవానికి జరిమానా విధించారు. ఏఎస్ఐ బషీర్, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వితరణ

గోరంట్ల: మండల పరిధిలోని ఎగువ గంగంపల్లి ఎస్సీ కాలనీ వాసులు కాలనీలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడానికి దాతల సహకారం కోరారు. స్పందించిన వానవోలు పంచాయతీ గుంటిపల్లి గ్రామానికి చెందిన బుట్టెన్న గారి రంగప్ప కుమారుడు సోముశేఖర్ ముందుకొచ్చారు. గంగంపల్లి ఎస్సీ కాలనీ వాసులకు ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని వితరణ చేశారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రొళ్ల: మండల పరిధిలోని నసేపల్లి గ్రామ శివారు వద్ద కర్ణాటక మద్యం పట్టుకున్నట్లు ఆదివారం సాయంత్రం ఎస్ఐ వీరాంజనేయులు తెలిపారు. బాజయ్యపాళ్యం చెందిన తిమ్మరాజు, దేవరాజు అక్రమంగా 45 మద్యం ప్యాకెట్లు (90 ఎంఎల్) కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పౌరహక్కులపై అవగాహన

అగళి: మండల పరిధిలోని ఇరిగేపల్లిలో పౌరహక్కులపై ఎస్ఐ వీరేష్ ప్రజలకు ఆదివారం అవగాహన కల్పించారు. దళితులను అవమానించినా, కులం పేరుతో వేధించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ భర్త లింగరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వ్యక్తికి తీవ్ర గాయాలు

పెనుకొండ రూరల్: ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన పట్టణ సమీపంలోని కుంభకర్ణ ప్రాజెక్ట్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. మహారాష్ట్రకు చెందిన విక్రమ్‌సింగ్ తోటి మిత్రులతో కలసి బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు పాదయాత్రగా వెళ్తున్నారు. కుంభకర్ణ ప్రాజెక్ట్ సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో విక్రమ్‌సింగ్ తీవ్రంగా గాయపడగా బెంగళూరు తరలించారు.

బాధితులకు పరామర్శ

పావగడ: తాలూకాలోని సీకే పుర గ్రామ పంచాయతీ పరిధిలోని హరిహరపుర గ్రామంలోని దళితవాడలో ఇటీవల సిలిండర్ పేలి దళితురాలు భూతమ్మ పూరి గుడిసె దగ్ధమైన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆర్థికసాయం అందించి పక్కా ఇల్లు నిర్మించేలా చూడాలని స్థానిక అధికారులను కోరారు.

పోస్టర్ల ఆవిష్కరణ

హిందూపురం: స్థానిక నానప్పనగర్‌లోని గాయత్రీదేవి మాత ఆలయ ప్రాంగణంలో వచ్చే నెల 18, 19వ తేదీలో చంద్రమౌళీశ్వరస్వామి పూజ, అనుగ్రహ భాషణం కార్యక్రమాల ఆహ్వాన పత్రిక, పోస్టర్లను బ్రాహ్మణ సంఘం సభ్యులు ఆదివారం విడుదల చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షులు విద్యాసాగర్, గాయత్రి ఆలయ అధ్యక్షులు రంగారావ్ , బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

పెనుకొండ: ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ క్యాలెండర్, డైరీని మంత్రి సవిత ఆవిష్కరించారు. పట్టణంలోని మంత్రి స్వగృహంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మంత్రితో పాటు ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, సుధాకర్, భూతన్న, బాబు, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, నారాయణస్వామి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



సుంకమ్మ (ఫైల్)

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన తిప్పయ్యనదుర్గ నివాసి, దివంగత బోయ ఇట్లయ్య భార్య సుంకమ్మ (53) అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే పోలీసు స్టేషన్ నంబర్ 9480802942కు ఫోన్ చేయొచ్చని పేర్కొన్నారు.



పరిటాల శ్రీరాములు డిగ్రీ కళాశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు



సమ్మేళనంలో పాల్గొన్న గుట్టూరు జిల్లా పరిషత్ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందడిగా జరిగింది. 2005–2008 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన 60 మంది పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్ప, అధ్యాపకులు ప్రతాప్, దేవిశెట్టిరామన్న, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణ సమీపంలోని త్రిపుర రిసార్ట్‌లో ఆదివారం గుట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1988–89 సంవత్సరం 10వ తరగతికి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఒకరినొకరు ఎంతో ఆప్యాయంగా పలకరించుకొని నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు.